## క్లుప్తంగా

### 'మోదీ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల శంకర్

**ఉట్నూర్‌రూరల్:** మోదీ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పెరిగిందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. మరోసారి మోదీ పీఎం కావాలని ప్రజలు కోరుతున్నారన్నారు. దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. గోడం నగేశ్‌కు ఓటు వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, కొండేరి రమేశ్, శేఖర్, లింగాగౌడ్, రాజేశ్వర్, బొడ్డు కిరణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

**ఇచ్చోడ:** మండలంలోని హీరాపూర్‌లో శుక్రవారం పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షకాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తుగా ప్రభుత్వం టీకాలు వేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది శేఖరావు, దేవురావు, తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల స్వీకరణ

**ఇచ్చోడ:** మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ యూనుస్ సలీం తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఆరో తరగతిలో బీసీ విద్యార్థులకు 2 సీట్లు, ఏడో తరగతిలో మైనార్టీలకు 1 సీటు, 8వ తరగతిలో మైనార్టీ విద్యార్థులకు 5 సీట్లు ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

### తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

**ఇచ్చోడ:** మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని మండల ప్రత్యేకాధికారి పుల్లయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని మేడిగూడ, మాన్కపూర్ గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణ కోసం తీసుకుంటున్న చర్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి సమస్యలు లేకుండా స్థానిక అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిషన్ భగీరథ సరఫరాలో చిన్న చిన్న మరమ్మతులను చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో లక్ష్మణ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జైపాల్ ఉన్నారు.

### రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

**ఆదిలాబాద్‌టౌన్:** అత్యవసర సమయంలో రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర నాయకుడు ఆత్రం వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం రిమ్స్ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో సభ్యులు రక్తదానం చేశారు. చించుఘాట్ గ్రామానికి చెందిన గెడం చంద్రభాన్ రెండు కిడ్నీలు చెడిపోయి రిమ్స్‌లో చికిత్స పొందుతుండగా ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో సభ్యులు రహటే గజ్జన్దయ సాయి కుమార్, కుమ్ర అశోక్, రాము, రాజు, సంజయ్, కృష్ణ, గణేష్ పాల్గొన్నారు.

### ఘనంగా మహా గణపతి, గోపూజ

**ఆదిలాబాద్‌రూరల్:** మావల మండలంలోని మావల శివారు ప్రాంతంలో గల గ్రీన్ వాల్యూలో హేమలత రమేశ్ శర్మ, బెజ్జవార్ రేణుక సంజీవ్ కుమార్‌ల ఆధ్వర్యంలో దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగానే శుక్రవారం మహాగణపతి, గోపూజ, యజ్ఞశాల ప్రవేశం, అఖండ దీపారాధన, అంకురార్పణ, నవగ్రహ వాస్తు, సర్వోతోభద్ర మండప స్థాపన పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

### పరామర్శ

**నేరడిగొండ:** కాంగ్రెస్ నాయకుడు ఆత్రం భాస్కర్ సోదరుడు ఆత్రం రవీందర్ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఏలేటి అశ్విన్ రెడ్డి శుక్రవారం వారి నివాసానికి చేరుకొని కుటుంబసభ్యులను పరామర్శించారు. రవీందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట జాదవ్ వసంత్, కుర్మే మహేందర్, మల్యాల అంజయ్య, నల్ల శ్రీకాంత్ రెడ్డి, తొడసం దౌలత్ రావ్, భోజన్న ఉన్నారు.

**నేరడిగొండ:** మండలంలోని బొందిడి గ్రామానికి చెందిన ఆడే మంగళ్ సింగ్ భార్య అంబిబాయి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే వారి నివాసానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారు. అంఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# డబుల్ రోడ్డు ఊసేది?

- నాయకుల హామీలు నీటిమూటలు
- ఇరుకు రోడ్డుతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు, ప్రజలు



డబుల్ రోడ్డుగా మార్చాల్సింది ఈ రోడ్డునే

**సిరికొండ:** రోడ్డు, రవాణా బాగుంటేనే ఆ గ్రామం అభివృద్ధిలో ముందుకు వెళ్తాది. అలాంటిది గిరిజన గ్రామాలకు కనీసం రోడ్డు సౌకర్యం ఉండడం లేదు. గత ఎన్నికల సమయంలో నాయకులు అనేక హామీలు ఇచ్చి గెలిచిన తరువాత వాటిని విస్మరిస్తున్నారు. నూతనంగా ఏర్పడిన సిరికొండ మండల కేంద్రానికి, ఇచ్చోడ నుంచి ఇంద్రవెల్లి మండలానికి డబుల్ రోడ్డు మంజూరు చేస్తాం అని గత పాలకులు, ప్రభుత్వాలు హామీ ఇచ్చాయి. కానీ ఆ తరువాత అమలుకు నోచుకోలేదు. మండల కేంద్రం నుంచి గ్రామం దాటే వరకు డబుల్‌రోడ్డు వేసి పనులు నిలిపివేశారు.

**చేరువగా నాగోబా..**

మండలం నుంచి ఇంద్రవెల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపడితే ఇదే దారిలో ఉన్న కేస్లాపూర్ నాగోబా ఆలయం, మహారాష్ట్రతో పాటు నిర్మల్, నిజామాబాద్ జిల్లాల చేరువతోంది. ప్రజలు నాగోబా దర్శించుకోవాలంటే ఇచ్చోడ నుంచి గుడిహత్నూర్ మీదుగా కేస్లాపూర్‌కు చేరుకోవచ్చు. సిరికొండ నుంచి రోడ్డు సౌకర్యం కల్పిస్తే దూరభారం తగ్గి పర్యాటకుల తాకిడి పెరుగుతుంది.

**నూతన ప్రభుత్వంపై ఆశలు..**

మండలాలను కలుపుతు నూతనంగా డబుల్ రోడ్డు మంజూరు చేసి నిర్మాణం చేపడుతామని సిరికొండ మండలవాసులకు ఆశలు రేపారు. అప్పటి ఎమ్మెల్యే కూడా హామీ ఇచ్చారు. ఇచ్చోడ నుంచి సిరికొండ మండలం మీదుగా ఇంద్రవెల్లి వరకు డబుల్ రోడ్డు మంజూరు అయితే మహారాష్ట్రలోని కిన్వట్ నుంచి వచ్చే వాహనాలు సిరికొండ మీదుగా మంచిర్యాల, కరీంనగర్‌కు వెళ్లావచ్చు. దీంతో దూర భారం తగ్గుతుంది. అలాగే ఇక్కడి ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుంది. రైతులు పండించిన పంటను మార్కెట్‌కు సులువుగా తరలించవచ్చు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి డబుల్ రోడ్డును కలను సహకారం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### రోడ్డు సౌకర్యం కల్పించాలి



సిరికొండ మండలానికి ఇచ్చోడ, ఇంద్రవెల్లి మండలాలను కలుపుతూ.. డబుల్ రోడ్డు వేయాలి. ఇప్పుడున్న ఇరుకు రోడ్డులో అత్యవసర సమయంలో రోగులను తరలించేందుకు ఇబ్బంది అవుతుంది. 108 వాహనం నడిపేందుకు అవస్థలు పడుతున్నాం.

– గోపాల్, 108 పైలెట్, సిరికొండ

### రవాణా మెరుగుపడుతుంది



సిరికొండ మండల కేంద్రానికి రెండు మండలాలకు లింకు ఉంది. కావున రెండు మండలాలను కలుపుతూ.. డబుల్ రోడ్డు మంజూరు చేయాలి. డబుల్ రోడ్డు ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడి అనేక విధాలుగా మండలం అభివృద్ధి చెందుతుంది.

– కుంరం రఘురాం, సిరికొండ

# బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

- బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్

**తాంసి:** బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని అంబుగాం, గిరిగాం, వడ్డాడి, జామిడి, వామన్‌నగర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పదేళ్లలో దేశంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్లు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులను నమ్మవద్దన్నారు. మూడోసారి ప్రధానమంత్రిగా మోదీని గెలిపించడం కోసం ఆదిలాబాద్ అభ్యర్థిగా ఉన్న తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతాంగే బ్రహ్మానంద్, జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, తాంసి జెడ్పీటీసీ రాజు, సదానంద్, పొచ్చన్న, నారాయణ, మహేందర్, సుభాష్, సాయిరాం పాల్గొన్నారు.



గిరిగాంలో ప్రచారం చేస్తున్న గోడం నగేశ్

### చింతకాయ ఒలుస్తూ..

**తాంసి:** ఎంపీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునేందుకు వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. ఆదిలాబాద్ బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్ శుక్రవారం మండలంలోని వామన్‌నగర్ గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఇంట్లో కూర్చొని చింతపండు తొక్క తీస్తున్న రాధారపు లక్ష్మీబాయి దగ్గరికి వెళ్లి తాను కూడా పనిలో పాలు పంచుకున్నాడు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని ముచ్చటించారు.



మహిళతో ముచ్చటిస్తున్న గోడం నగేశ్

# ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

**ఆదిలాబాద్‌రూరల్:** ఆదిలాబాద్ పట్టణ శివారు ప్రాంతంలోని బెల్లూరిలో విఠలేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంత లభిస్తుందన్నారు. గ్రామస్తులందరూ కలిసి ఆలయ నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అశోక్, ముకుంద్, శివ, రాజు, గ్రామస్తులు అరవింద్, సాయి, ప్రమోద్ పాల్గొన్నారు.

**ఆలయాల నిర్మాణాలతో ఆధ్యాత్మికం**

గ్రామాల్లో ఆలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుందని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శుక్రవారం బెల్లూరి గ్రామంలో నూతనంగా నిర్మించిన విఠలేశ్వర రుకుంబాయి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట నాయకులు ధమ్మపాల్, కొండ గణేష్, సంజయ్ ఉన్నారు.

**ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే**



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్‌టౌన్:** ఖానాపూర్ నియోజకవర్గంలోని కడెం మండలం అల్లంపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన శ్రీసీతారామచంద్ర స్వామి ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ఠాపన, జీయరు గురుకులం జూనియర్ కళాశాల ప్రారంభోత్సవానికి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి ఆశీస్సులు తీసుకొని పూజలు చేశారు. ప్రతిఒక్కరు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సూచించారు.

# కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

**బేల:** కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ యూత్ ఆదిలాబాద్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సామ రూపేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని సోన్‌కాస్ గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అర్హులైన నిరుపేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం రూ.10లక్షల పెంచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు కన్యరాజు, మెస్రం జనార్దన్, గేడాం బాపురావు, రాజారాం, నవీన్, పాండురంగ్, మారోతి పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న సామ రూపేశ్‌రెడ్డి

**నేరడిగొండ:** బోథ్ మండలంలోని గొల్లాపూర్, మామిడిగూడ గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి గోడ స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో నాయకులు గాజుల పోతన్న, అరుణ, విజయభాస్కర్ రెడ్డి, భారతిబాయి, పెందూర్ గంగాధర్, లాలూ, రాము పాల్గొన్నారు.

- ఆదివాసీల హక్కులు కాపాడుతున్న కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కాంగ్రెస్ ఆదివాసీ రాష్ట్ర వైస్ చైర్మన్ కొమురం కోటేశ్వర్ అన్నారు. శుక్రవారం బోథ్ మండలంలోని పట్నాపూర్, ఇన్కర్పల్లి, నక్కలవాడ, రేండ్లపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఆదివాసీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఇచ్చోడ వైస్ ఎంపీపీ జలాయ్‌జాకు, పసుల చంటి, రాంచందర్ పాల్గొన్నారు.

### 'కాంగ్రెస్‌ను ఆదరించండి'

**ఆదిలాబాద్‌రూరల్:** పేదలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని తీసుకువచ్చిందని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని ఆ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొరంచు శ్రీకాంత్ రెడ్డి కోరారు. శుక్రవారం మావల మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ కూలీలను కలిసి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, జాతీయ కాంగ్రెస్ మేనిఫెస్టో అంశాలను వివరించారు. కూలీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో మావల మండల్ అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, తాడేసిన వెంకట్ రెడ్డి, నలిమేలా నవీన్‌రెడ్డి, నాగరాజు, సురేశ్, ప్రభాకర్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

### ఎమ్మెల్యేకు సన్మానం

**ఇచ్చోడ:** మండలంలోని కోకస్‌మన్నూర్ గ్రామస్తులు శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కోకస్‌మన్నూర్‌లో నిర్మిస్తున్న శివాలయం కోసం ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ రూ. 20 వేలు విరాళం అందచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆలయాల నిర్మాణానికి కృషి చేసిందన్నారు. ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో కోకస్‌మన్నూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

### టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జ్ఞానేశ్వర్

**ఉట్నూర్‌రూరల్:** తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మరసుకోల జ్ఞానేశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి శుక్రవా రం ఒక ప్రకటనలో తెలిపారు. తనను ఎన్నుకోవ డం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

### జాబ్‌కార్డు ఉన్న అందరికీ ఉపాధి

**ఇచ్చోడ:** జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ ఉపాధి కల్పిస్తున్నామని ఎంపీడీవో లక్ష్మణ్ తెలిపారు. శుక్రవారం రోజ్‌ఘార్ దివాస్ సందర్భంగా ఇచ్చోడలో ఉపాధి కూలీలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వేసవిలో వ్యవసాయ పనులు దొరకకపోవడంతో కూలీలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రతిఒక్కరికీ వంద రోజులు పని కల్పిస్తామన్నారు.

### ఆర్థిక సాయం

**నార్నూర్:** మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న గైక్వాడ్ నందిని, కార్తీక్ విద్యార్థుల తండ్రి గైక్వాడ్ సుభాష్ రెండు రోజుల క్రితం కూలీ పని చేస్తూ.. మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రధానోపాధ్యాయురాలు పవార్ అనిత, పాఠశాల సిబ్బంది శుక్రవారం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. రూ. 5,200లతో పాటు 25 కిలోల బియ్యం అందజేశారు. ఉపాధ్యాయులు ప్రేమ్‌సింగ్, లక్ష్మణ్, ఈశ్వర్, సావిత్రి, నిర్మల పాల్గొన్నారు.

### నేడు కాంగ్రెస్‌లోకి గజానంద్‌నాయక్

**నార్నూర్:** బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజా నంద్ నాయక్ శనివారం కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఉట్నూర్‌లో రాష్ట్ర మంత్రి సీతక్క సమక్షంలో 200 మంది అనుచరులతో చేరుతున్నట్లు శుక్రవారం ఆయన తెలిపారు.

### వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

**నేరడిగొండ:** వేసవిలో రైతులు, పశువుల కాపరులు అగ్నిప్రమాదాలు చోటుచేసుకుండా జాగ్రత్తలు పాటించాలని బోథ్ ఎఫ్ఆర్‌వో ప్రణయ్, ఎస్సై రాము అన్నారు. శుక్రవారం బోథ్ ఎక్స్‌రోడ్ వద్ద గల అర్బన్ పార్కును పరిశీలించారు. చించోలి గ్రామ రైతులతో మాట్లాడారు. దగ్గరలో పార్కు ఉన్నందున బీడీలు, సిగరేట్లు తాగిన సమయంలో అగ్గిపుల్లలను ఎక్కడబడితే అక్కడ వేయావద్దన్నారు. ఇటీవల అర్బన్ పార్క్‌లో మంటలు చెలరేగాయని, జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

### ఘనంగా రోజ్‌గార్ దివస్



రోజ్‌గార్ దివస్ గురించి వివరిస్తున్న ఎంపీడీవో రాజ్‌వీర్

**నేరడిగొండ:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం రోజ్‌గార్ దివస్ కార్యక్రమాన్ని మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మండలంలోని గుత్పాల గ్రామంలో ఉపాధిహామీ పని ప్రదేశంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీడీవో రాజ్‌వీర్, ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావులు హాజరై రోజ్‌గార్ దివస్ గురించి కూలీలకు వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కూలీలు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

**నేరడిగొండ:** బోథ్ మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచార రథం ప్రారంభించారు. ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, ఆత్మ చైర్మన్ మల్లెపూల సుభాష్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఎలుక రాజు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు భీమా బుచ్చన్న, మండల నాయకులు ద్యగల నారాయణ్, బీసీ బోథ్ పట్టణ అధ్యక్షుడు ఎస్‌వి రమణ, రామారావ్ పాల్గొన్నారు.

### పండ్లు పంపిణీ

**ఉట్నూర్‌రూరల్:** హనుమాన్ స్వాములకు లక్కారం గ్రామస్తులు, యువకులు పండ్లు, నీళ్ల బాటిళ్లు పంపిణీ చేశారు. మండుటెండల్లో కొండగట్టుకు వెళ్తున్న స్వాములకు పాదయాత్రలో ఎలాంటి అటంకాలు కలగకుండా పంపిణీ చేసి, వారి ఆశీర్వదం తీసుకున్నారు. అలాగే హర్కాపూర్‌లో అన్నదానం చేశారు. యువ నాయకులు జయచంద్ర, మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి, హర్కాపూర్ గ్రామంలో సామాజిక కార్యకర్త మెస్రం కేవవ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

### బస్టాండ్‌లో ఫ్రిడ్జ్ ఏర్పాటు



ఫ్రిడ్జ్ ప్రారంభిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం

**ఎదులాపురం:** లయన్స్ క్లబ్, కాటన్ సిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం కోసం ఫ్రిడ్జ్‌ను ఏర్పాటు చేశారు. ఆర్టీసీ ఆర్ఎం సోలోమన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని లయన్స్ క్లబ్ వారు ఫ్రిడ్జ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్, కాటన్ సిటీ బాధ్యులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

# 'మే డే' విజయవంతం చేయండి

**గుడిహత్నూర్:** మే డేను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షకులను విస్మరించి పాలన చేస్తున్నారని ఆరోపించారు. కార్మిక హక్కుల కోసం నిరంతర ఉద్యమంలో రాజకీయ నాయకులు, విద్యావేత్తలు భాగస్వామ్యులు కావాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సంఘ మండలాధ్యక్షుడు మోహితే మారుతి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్, ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ఆదిలాబాద్‌టౌన్:** విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని కైలాస్‌నగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు పట్టణంలోని శాంతినగర్, కుమ్మరివాడ, పాత హౌజింగ్ బోర్డు, వాల్మీకినగర్, అటెండర్ కాలనీ, పాలిటెక్నిక్ ఫీడర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. భోరజ్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

**జైనథ్:** మండలంలోని భోరజ్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ గంగాధర ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందన్నారు.

**ఆదిలాబాద్‌రూరల్:** జీఎస్ నగర్‌లోని 33/11 ఉపకేంద్రంలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్‌శాఖ అధికారి తిరుపతి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రాంపూర్, పొచ్చర, జందాపూర్, భీంసరి గ్రామాలకు అంతరాయం ఉంటుందన్నారు.

**నార్నూర్:** 33/11కేవి సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

# గుడుంబా పానకం పారబోత

**గుడిహత్నూర్:** మండలంలోని నేరడిగొండతండాలో శుక్రవారం పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో గుడుంబా తయారు చేసే పానకాన్ని, 15 లీటర్ల గుడుంబాను ధ్వంసం చేశారు. శుక్రవారం గ్రామంలో తనిఖీలు చేపట్టారు. గుడుంబా తయారు చేస్తున్న ముగ్గురిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు. గుడుంబా సరఫరా, తాగేవారి ఆరోగ్యం, బాల్యవివాహాలు, రోడ్డు నిబంధనలు గురించి అవగాహన కల్పించారు. దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పానకాన్ని పారబోస్తున్న పోలీసులు